198) భైరవి

ప॥ ననుజూచి హరి నీవు నవ్వకుండేవా। పనిమాలెంత బయలుపాకీ నామనసు।

చ॥ మనసుకు గోచరమా మాటలకు గోచరమా। కనుగొన వసమా నీఘనరూపము।
నిను వెదుకుచున్నాడ నీవెక్కడ నే నెక్కడ। జనుడ నింతె యెంత సాహసము నాది॥

చ॥ వున్నచో టెఱుగుదునా వోయీ అంటే బలికేవా। యెన్ని తెలియదరమా యిట్టి నీమాయ।
అన్నిటా నీకొలువుసేయ గడగుచున్నవాడ। యెన్నటిపొందు నీవు నాకెంత దిట్టతనమో॥

చ॥ వాకిలి గానవచ్చునా వంచించి చొరవచ్చునా। రాకపోక కబ్బునా పరమపదము।
శ్రీకాంతుడ ప్రత్యక్షమై శ్రీవేంకటాద్రి యిదె। కైకొంటి నీకృప నెంత గట్టువాయతనమో॥